క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని ఐసీడీఎస్ దర్శి ప్రాజెక్టు సీడీపీఓ భారతి తెలిపారు. ఆరవల్లిపాడు-1 కార్యకర్త బీసీ (డి), ఆయాలు రుద్రసముద్రం-1 ఎస్సీ, రుద్రసముద్రం-2 బీసీ (బి), మంగినపూడి బీసీ (జనరల్), కొచ్చెర్లకోట-2 ఓసీ (జనరల్), బాదాపురం-2 బీసీ(ఏ) కేటగిరి వర్గాలకు కేటాయించారని తెలిపారు. అర్హత ఉన్న మహిళలు విద్యార్హత పత్రాలు, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ సూచించారు.

ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలి

కురిచేడు: స్థలాలు ఉండి ఇళ్లు నిర్మించుకునేందుకు సిద్ధంగా ఉన్న వారు ఈ నెల 15వ తేదీ లోపు సచివాలయంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు లేదా హౌసింగ్ ఏఈ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ మనోహర్ తెలిపారు. పీఎంఏవై-2.0 కింద ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుతో పాటు భార్యాభర్తల ఆధార్‌కార్డు జిరాక్సు, బ్యాంకు ఖాతా జిరాక్సు, రేషన్‌కార్డు జిరాక్సు, స్థలం ధ్రువీకరణ పత్రం, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఉపాధి హామీ జాబ్‌కార్డులు అందజేయాలని ఆయన కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వేముల చెరువుకు వేలం



చేపల చెరువుకు వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని వేముల చెరువుకు శుక్రవారం వేలంపాట నిర్వహించగా దర్శి మండలం తూర్పు చౌటపాలెం గ్రామానికి చెందిన ఇడమకంటి రవీంద్రారెడ్డి రూ.11 లక్షలకు దక్కించుకున్నారు. ఎంపీడీఓ జనార్దన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వేలం పాటకు ప్రభుత్వ ధర రూ.11 లక్షలుగా నిర్ణయించగా రూ.8 వేలు మాత్రమే ఎక్కువ పాటకు పాడుకోవడం గమనార్హం. సర్వే నంబర్ 352/2, 361/2లో ఉన్న చెరువు విస్తీర్ణం ఎ.57.77 ఎకరాలు కాగా 2024 నుంచి 2027 వరకు చెరువులో చేపలు వేసుకునేందుకు పాటదారునికి అనుమతి ఉంటుంది.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు



సారాబట్టీని ధ్వంసం చేస్తున్న సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది

పుల్లలచెరువు: గ్రామాల్లో నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. జిల్లా అధికారుల ఆదేశాలపై మండలంలోని పెద్ద పీఆర్‌సీ తండా పరిధిలో శుక్రవారం దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాటుసారా తయారు చేసినట్లు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. నాటుసారా తయారీ, అమ్మకాలు చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.

ఎరువుల అమ్మకాలు నిలుపుదల



ఎరువుల దుకాణాలు తనిఖీ చేస్తున్న అధికారులు

దర్శి: ఎరువుల దుకాణాల్లో శుక్రవారం జరిగిన తనిఖీల్లో వ్యత్యాసాలు ఉన్నాయని గుర్తించిన విజిలెన్స్ సీఐ రాఘవరావు 6ఏ కేసులు నమోదు చేసి శుక్రవారం ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా రాఘవరావు మాట్లాడుతూ కొన్ని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేసి వ్యత్యాసాలు గమనించామన్నారు. అందులో భాగంగా పట్టణంలోని ఝాన్సీ ఏజెన్సీస్‌లో సుమారు రూ.1,11,500 విలువైన ఎరువుల అమ్మకాలు, మణికంఠ ట్రేడర్స్‌లో రూ.3,01,150 విలువైన ఎరువుల అమ్మకాలు, నాగార్జున ట్రేడర్స్‌లో రూ.89,100 విలువైన ఎరువులు, పరమేశ్వర ఫర్టిలైజర్స్‌లో ఎరువులను సీజ్ చేశామని చెప్పారు. ఆ దుకాణాల్లో అమ్మకాలు నిలుపుదల చేసి 6ఏ కేసులు నమోదు చేశామన్నారు. రైతులకు అందించే ఎరువుల విషయంలో కఠినంగా ఉంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీటీఓ రామారావు, విజిలెన్స్ ఏఓ నాగప్రసాద్, మండల వ్యవసాయాధికారి బాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

పొగాకు కూలీలకు గిరాకీ

కురిచేడు:



పందిరల్లో పొగాకు గుచ్చుతున్న కూలీలు

పొగాకు పనికి వెళ్లే కూలీలకు గిరాకీ ఏర్పడింది. ఈ ఏడాది అడపా దడపా కురిసిన వర్షాలకు పొగాకు పంట ముందస్తుగా వేసినా అంతా ఒకేసారి కోతకు వచ్చింది. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు సాగు చేయడంతో కూలీలకు గిరాకీ మరింత పెరిగింది. అంతే కాకుండా సాగర్ కాలువకు సాగుకు నీరు విడుదల కావడంతో రైతులు మాగాణి పంట సాగు చేస్తున్నారు. రైతులందరికీ ఒకేసారి కూలీలతో అవసరం రావడంతో కూలీల కూలి ధరలు ఆకాశాన్నంటాయి. రెండు వారాల వరకు పొగాకు కోతకు వెళ్లిన కూలీకి రోజుకు రూ.800 నుంచి రూ.900 వరకు ఇచ్చారు. అంతే కాకుండా వారి ఇంటి వద్ద నుంచి పొలం వరకు వాహనం ఏర్పాటు, మధ్యాహ్నం స్నాక్స్ కూడా ఇచ్చి రైతులు పనులకు తెచ్చుకునే వారు. ఇటీవల ముందస్తుగా నాటిన పొగాకు తగ్గుముఖం పట్టడంతో కాస్తంత కూలి ధర తగ్గి మహిళలకు రోజుకు రూ.600, పురుషులకు రూ.800 కూలి ఇస్తున్నారు.

ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి

మండలంలో పొగాకు పంట 3,500 ఎకరాల్లో సాగు చేశారని వ్యవసాయశాఖ రికార్డులు తెలుపుతున్నాయి. ఎకరానికి పొగాకు నాటు నుంచి పూర్తయ్యే వరకు లక్ష రూపాయలు ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. ప్రతి పనికి కూలీల అవసరం ఉందని రైతులు తెలిపారు. పొగాకు కోతకు మాత్రమే ఎకరానికి ఐదు కోతలకు కలిపి 60 మంది కూలీలు అవసరమవుతుందని, అందులో 15 మంది పురుషుల అవసరం ఉంటుందన్నారు. ఎకరాకు సరాసరి 8 క్వింటాళ్ల పండుతుందని, దానికి పొగాకు కంపెనీలు మొదటి రకం పొగాకుకు క్వింటాకు రూ.15 వేల వరకు ధర ఇస్తారని తెలిపారు. మిగిలిన వాటికి రూ.10 వేల వరకు ధర వస్తుందన్నారు. పొలం బీడు పడకుండా ఉండేందుకు, పది మందికి పని చూపేందుకే పొగాకు పంట సరిపోతుందని, నష్టం రాకుండా ఉంటే చాలని ఆశిస్తున్నామని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పొగాకు కంపెనీ వారు గరిష్ట ధర పెంచితే ఎకరానికి రూ.10 వేలు నుంచి రూ.20 వేల వరకు మిగులుతుందని రైతులు పేర్కొంటున్నారు.

నాలుగు నెలలు ఇబ్బంది లేదు:



పొగాకు సీజన్ ఉండే నాలుగు నెలలు మాత్రం కూలీలకు గిరాకీ భలే ఉంటుంది. ఆ తర్వాత రెండు..మూడు వందల రూపాయల కన్నా ఎక్కువ ఇవ్వరు. ఈ నాలుగు నెలలు సక్రమంగా పనికి వెళ్తే ఏడాదికి సరిపోయేంత సంపాదించుకోవచ్చు. ఇంట్లో నలుగురుంటే ఇంకా సంపాదన బాగుంటుంది. ఏడాదికి నాలుగు నెలలు మాత్రమే ఈ సీజన్ ఉంటుంది.

ఇందూరి నాగలక్ష్మి, కూలీ, కురిచేడు

దూరప్రాంతాల నుంచి వస్తున్నారు:



పొగాకు పనులకు ముండ్లమూరు, వినుకొండ, నూజెండ్ల తదితర దూర ప్రాంతాల నుంచి కూడా వస్తున్నారు. ఈ పని చేయడం కూడా కష్టమైందే. అందరికీ గిట్టదు. కొంతమంది అనారోగ్యం పాలై ఇక్కడ సంపాదించిందంతా ఆస్పత్రులకు పెట్టాల్సి వస్తోంది. వేరే పనులు అంతగా లేకపోవటంతో పొగాకు పనికి వెళ్లాల్సి వస్తోంది.

గాదె గాయత్రి, కూలీ, కురిచేడు

భక్తుల కొంగు బంగారం..కాశీనాయన!

- నేటి నుంచి కాశీనాయన ఆరాధన మహోత్సవం



ప్రత్యేక అలంకారంలో కాశీనాయన మూలవిరాట్

పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టు సమీపంలో వెలసిన సమర్థ సద్గురు శ్రీ కాశీనాయన స్వామి భక్తులకు కొంగు బంగారంగా భాసిల్లుతున్నారు. పశ్చిమ ప్రాంతాల ప్రజలకు కాశీనాయన ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందిందని, స్వామి వారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఏటా డిసెంబర్‌లో కాశీనాయన ఆరాధన మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. దేవాలయాన్ని విద్యుద్దీపాలతో సర్వంగా సుందరంగా అలంకరించారు. శ్రీ కాశీనాయన ఆలయంలో శని, ఆదివారాల్లో 29వ ఆరాధన మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. శనివారం కాశీనాయన విగ్రహానికి అభిషేకాలు, నాగులపుట్టకు పూజలు, ఆదివారం ఉదయం సుప్రభాతసేవ, నవగ్రహ మండపారాధన, కలశ పూజ, పంచామృతం, మంత్ర పుష్పం, తదితర పూజలు నిర్వహిస్తారని అర్చకులు బీవీ దత్తయ్య తెలిపారు. 11 గంటలకు భక్తిభజన కార్యక్రమం, మధ్యాహ్నం కోలాట ప్రదర్శన, సాయంత్రం కర్రసాము ప్రదర్శన, సాయంత్రం కోలాట ప్రదర్శన, రాత్రి శ్రీ సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకం ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు అన్న సంతర్పణ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

16 నుంచి ధనుర్మాస మహోత్సవాలు



రామాలయంలో కొలువై ఉన్న దేవతామూర్తులు

పుల్లలచెరువు: మండల కేంద్రంలోని రామాలయంలో, ఉమ్మడివరం గ్రామంలోని కోదండరామాలయంలో ఈ నెల 16 నుంచి జనవరి 15వ తేదీ వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి శంకు తెలిపారు. ధనుర్మాసంలో వేకువ జాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెలలో జరిగే ముక్కోటి ఏకాదశ సందర్భంగా పుల్లలచెరువు రామాలయంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహిస్తామని ఆలయ పూజారి అనంతాచార్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ధనుర్మాస ఉత్సవాలు విజయవంతం చేయాలని కోరారు.

ర్యాలీకి భారీ ఎత్తున తరలివెళ్లిన రైతులు



వై.పాలెం నుంచి ర్యాలీకి బయల్దేరుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి, రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు

యర్రగొండపాలెం: రైతులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వానికి నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో తలపెట్టిన ర్యాలీ, కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించేందుకు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి రైతులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున తరలి వెళ్లారు. నియోజవర్గంలో ఉన్న 96 పంచాయతీల నుంచి తాము సొంతంగా ఏర్పాటు చేసుకున్న దాదాపు 80 వాహనాల్లో ఒంగోలుకు వెళ్లారు. తరలి వెళ్తున్న వాహనాలను పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టు వద్ద ఎమ్మెల్యే పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. జై జగనన్న, రైతులను మోసం చేసే కూటమి సర్కార్ కుప్పకూలి పోవాలని రైతులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ముస్లిం మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ మజీద్, జెడ్పీటీసీలు చేదూరి విజయభాస్కర్, యేర్వ చలమారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య, మండల పార్టీ అధ్యక్షులు కె.ఓబులరెడ్డి, పి.కృష్ణారెడ్డి, గంటా వెంకటరమణారెడ్డి, ఎస్.పోలిరెడ్డి, బీసీ సెల్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎల్లేష్ యాదవ్, రాచగొర్ల వెంకట పిచ్చయ్య, మండల సచివాలయాల కన్వీనర్లు సయ్యద్ జబీవుల్లా, డి.వెంకటేశ్వర్లు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, వివిధ విభాగాల నాయకులు భూమిరెడ్డి సుబ్బారెడ్డి, ఆర్.అరుణాబాయి, టి.సత్యనారాయణ, కోటిరెడ్డి, దుద్యాల వెంకటరెడ్డి, తోకల ఆవులయ్య, ఎం.రాంభూపాల్‌రెడ్డి, ఎం.తిరుపతిరెడ్డి, ఎ.లక్ష్మీరెడ్డి, పవన్‌కుమార్, దగ్గుల గోపాల్‌రెడ్డి, సరళ, కోట్ల గురువారెడ్డి పాల్గొన్నారు.



కురిచేడు: ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వైఎస్సార్ సీపీ ధర్నాకు తరలిన నాయకులు

కురిచేడు: రైతులకు మద్దతుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ధర్నాకు మండలం నుంచి జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ఒంగోలు తరలి వెళ్లారు. రైతులకు అండగా ఉండేందుకు పార్టీ తలపెట్టిన కార్యక్రమం విజయవంతం చేసి కూటమి ప్రభుత్వం రైతులకు చేస్తున్న మోసాలను ఎండగట్టేందుకు నాయకులు బయల్దేరి వెళ్లారు. వెళ్లిన వారిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ వైవీ సుబ్బయ్య, నాయకులు ఊట్ల వెంకటేశ్వర్లు, నుసుం ఆరుద్రారెడ్డి, కోలా సంతోష్‌కుమార్, కృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ కండె గంగయ్య ఉన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి



పుల్లలచెరువు: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

దొనకొండ: భూ సమస్యలు పరిష్కరించాలని ఒబ్బాపురం, వీవీపురం గ్రామ ప్రజలు తహసీల్దార్ బి.రమాదేవికి శుక్రవారం రెవెన్యూ సదస్సులో విన్నవించారు. ఈ సందర్భంగా ఓబ్బాపురంలో 10, వీవీపురంలో 14 అర్జీలు స్వీకరించారు. తమ సిబ్బందితో అర్జీలు పరిష్కరించి అర్హులైన వారికి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునరెడ్డి, లైసెన్స్ సర్వేయర్ వెంకట్రావు, వీఆర్‌ఓ మాచర్ల, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లలచెరువు: భూ వివాదాలు, భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బాలకిషన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రాచకొండలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ భూ వివాదాలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. రైతుల సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించుకోవాలని, రికార్డులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్వేయర్ రాములునాయక్, సర్పంచ్ శ్రీనువాసులు, నాయకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలకు తరలిన కార్యకర్తలు



చీమకుర్తికి తరలి వెళ్తున్న సీపీఎం కార్యకర్తలు

దొనకొండ: చీమకుర్తి పట్టణంలో శుక్రవారం జరిగిన సీపీఎం మహాసభలకు దొనకొండ ప్రాంతం నుంచి ఆ పార్టీ కార్యదర్శి చిరుపల్లి అంజయ్య ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లారు. దొనకొండ పారిశ్రామిక కారిడార్‌కు నిధులు కేటాయించాలని, యువతకు ఉపాధి చూపించాలని, వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని, నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి మౌలిక సదుపాయాలు కల్పించాలని, రైతులకు పండే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, నిత్యావసరాల ధరలు, పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని, పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఉప సంహరించుకోవాలని మహాసభలో సీపీఎం పెద్దలకు విన్నవించాలని తరలి వెళ్లారు. నాయకులు కె.కిరణ్‌కుమార్, వై.ప్రభాకర్, చిన్న బాలకోటయ్య, కొండా ఏసుదాసు, ఇశ్రాయేలు, కమిటీ సభ్యులు, కార్యకర్తలు ఉన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి



పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: రబీలో సాగు చేసిన ప్రతి పంటను ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయాధికారి కె. బుజ్జిబాయి అన్నారు. మండలంలో దేవరాజుగట్టు రైతు సేవా కేంద్రం పరిధిలో ఈ-క్రాప్ నమోదును ఆమె శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేసుకునేందుకు రైతులు పట్టాదారుని పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ పుస్తకం, కౌలు రైతులైతే కౌలు కార్డు తీసుకొని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా అందే ప్రతి పథకం ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే వర్తిస్తాయన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన నమోదు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ఇన్సూరెన్సు చేసుకున్న రైతులు లబ్ధి పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ పథకం ద్వారా తుఫాన్‌లు, కరువులు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని, ఈ అవకాశాన్ని కౌలు రైతులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వెలుగు ఏపీఎం, సీసీలకు సన్మానం



ఏపీఎం, సీసీలను సన్మానిస్తున్న ఉద్యోగులు

కొనకనమిట్ల: స్థానిక వెలుగు కార్యాలయంలో పని చేస్తూ ఇటీవల బదిలీ అయిన ఏపీఎం, సీసీలను శుక్రవారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఏపీఎం కె.గోపాలకృష్ణారెడ్డి, సీసీలు యర్రా, రాజయ్య, సురభయ్య పొదిలి మండలానికి బదిలీ కాగా వారికి ఏపీఎం సుధాకర్ ఆధ్వర్యంలో తోటి సిబ్బంది వీడ్కోలు పలికారు. అనంతరం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య మాజీ అధ్యక్షురాలు యంబాడి ఈశ్వరమ్మ, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి



తాళ్లూరు: మాట్లాడుతున్న తహసీల్దార్ సంజీవరావు

తాళ్లూరు: మండలంలో శనివారం జరుగనున్న నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని తహసీల్దార్ సంజీవరావు అధికారులకు శుక్రవారం సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు. రైతులు తమ ఓటు హక్కు పత్రాలు తీసుకొచ్చేలా ప్రతి గ్రామంలో దండోరా వేయించాలని సూచించారు. ఎంపీడీఓ సుందరరామయ్య, ఏంఈఓ సుబ్బయ్య, సుధాకర్, ఏఓ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

దొనకొండ: మండలంలో 11 నీటి సంఘాల ఎన్నికలు శనివారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. సిబ్బంది ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉంటారని చెప్పారు. మధ్యాహ్నం 12 గంటల వరకు టీసీ మెంబర్ల ఎన్నిక, సాయంత్రం 3 గంటల నుంచి అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నిక నిర్వహిస్తామన్నారు. ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలని, ఏవైనా సమస్యలుంటే తమకు వెంటనే తెలియజేసి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సూచించారు.

సైడ్ కాలువల్లో పూడికతీత



మురుగు తొలగిస్తున్న పొక్లెయిన్

సాక్షి ఎఫెక్ట్..

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరంలో ఒంగోలు-దర్శి ప్రధాన రహదారిలో నిలిచిన మురుగు నీటిపై ఈ నెల 7న 'అధ్వానంగా తూర్పు గంగవరం ప్రధానం రోడ్డు' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ఓ కథనం ప్రచురితమైంది. పంచాయతీ అధికారులు శుక్రవారం స్పందించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న సైడ్ కాలువల్లో చెత్త చెదారాన్ని పొక్లెయిన్ సహకారంతో తొలగించారు. దీంతో ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉన్న తూర్పుగంగవరం పరిశుభ్రంగా మారింది. స్థానిక దుకాణ యాజమానులు, పాదచారులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.